




సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

శనివారం 9-11-2024

సంపుటి: 20 సంచిక: 192
పేజీలు: 4 వెల: రూ.1




- ఎంపీగా పోటీ చేయాలని చెప్పిన జగన్
- కుటుంబంలో ఎవరికైనా అసెంబ్లీ టిక్కెట్ ఇవ్వాలన్న సీతారాం
- చిరంజీవినాగ్‌ను తనకు వదిలేయమన్న అధినేత
- జగన్‌తో భేటీ అయిన తమ్మినేని

# సీతయ్యా... అలా కుదరదయ్యా!

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కొడుకులు, కోడళ్లు, కూతుళ్లు అలా పక్కకెళ్లి ఆడుకోండమ్మా.. మీ గేమ్ స్టార్ట్ అయినప్పుడు గ్రౌండ్‌లోకి వద్దురు గాని! అంతవరకు మా ఆటను మాకు ఆడుకోనివ్వండి. అని వైకాపా అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా తన పార్టీ సీనియర్లకు సంకేతాలివ్వడం కాదు.. స్పష్టం చేసేస్తున్నారు. 2027లో ఎట్టి పరిస్థితుల్లోనూ మోా-షా ద్వయం జమిలీ ఎన్నికలకే వెళ్తాయని, ఈలోగానే నియోజకవర్గాలన్నింటినీ సెటరేట్ చేయాలని జగన్మోహన్‌రెడ్డి భావిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం ఆమదాలవలస వైకాపా ఇన్‌ఛార్జి తమ్మినేని సీతారాం దంపతులతో రాష్ట్ర రాజధానిలో ఏకాంతంగా గంట పాటు చర్చలు జరిపారు. ఈసారి ఎట్టి పరిస్థితుల్లోనూ సీతారాం పార్లమెంట్‌కే వెళ్లాలని జగన్మోహన్‌రెడ్డి సూటిగా చెప్పినట్టు భోగట్టా. అందుకే కొద్ది రోజుల క్రితం శ్రీకాకుళం పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ప్రకటించామని, ఆ మేరకు శక్తియుక్తులు కూడగట్టుకోవాలని సూచించినట్లు తెలుస్తుంది. 2014, 2019లలో ఇదే సామాజిక వర్గం నుంచి ఎంపీ అభ్యర్థిని నిలిపినా ఫలితం రాలేదని, అందుకు కారణం అప్పటికప్పుడు తీసుకున్న నిర్ణయాలేనని, ఈసారి అలా కాకుండా తమ్మినేని మాత్రమే జిల్లా నుంచి పార్లమెంట్‌కు పోటీ చేసే కళింగ సామాజికవర్గ నేత అని జగన్మోహన్‌రెడ్డి పేర్కొన్నట్లు తెలుస్తుంది. ఆమదాలవలస నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యే కూన రవితో తనకు వైరం ఉందని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఆమదాలవలస అసెంబ్లీకి పోటీ చేసి గెలుస్తానని సీతారాం చెప్పినా, అందుకు జగన్మోహన్‌రెడ్డి సమ్మతించలేదని ఒక టాక్ నడుస్తుంది. తనకు అసెంబ్లీ టిక్కెట్ ఇవ్వనప్పుడు తన కుమారుడికి ఆమదాలవలసలో నిలపాలని కోరగా, చిరంజీవి నాగ్ భవిష్యత్తు తాను చూసుకుంటానని జగన్మోహన్‌రెడ్డి అన్నారని వినికిడి. అలా కానప్పుడు కోడలు, తన కుమార్తెనైనా అసెంబ్లీ బరిలో నిలపాలన్న ఆలోచన జగన్మోహన్‌రెడ్డి ముందు పెట్టగా, రాబోయే ఎన్నికలు వైకాపాకు కీలకమైనవని, గతసారి ఇటువంటి మొహమాటాలకు పోయి అధికారాన్ని కోల్పోయామని, ఈసారి ఎట్టి పరిస్థితుల్లోనూ సీతారాం పార్లమెంట్‌కే వెళ్లాలని స్పష్టం చేసినట్లు తెలుస్తుంది. ఆమదాలవలస అసెంబ్లీ టిక్కెట్ వ్యవహారం తనకు వదిలేయాలని, వైకాపా అభ్యర్థిగా ఎవరున్నా అక్కడ గెలిపించాల్సిన బాధ్యత కూడా సీతారామ్‌దేనని స్పష్టం చేసినట్లు చెప్పుకుంటున్నారు. జగన్మోహన్‌రెడ్డి శ్రీకాకుళంలో ఒక్కొక్క నియోజకవర్గాన్ని క్లియర్ చేసుకుంటూ వస్తున్నారు. ఇందులో ఇచ్ఛాపురం, పలాసలో రాబోయే ఎన్నికలకు ఎటువంటి మార్పులు ఉండవు. ఇప్పటికే టెక్కలి అసెంబ్లీ ఇన్‌ఛార్జిగా తిలక్‌ను ప్రకటించడం వల్ల అక్కడ కూడా సమస్య తీరిపోయింది. దాసన్న ఉన్నంత వరకు నరసన్నపేటలో మార్పు ఉండదు కాబట్టి ఇక శ్రీకాకుళంలో ధర్మాన ప్రసాదరావు లెక్కే తేలాల్సి ఉంది. ఇందుకోసమే రెండు రోజుల క్రితం వైకాపా ఉత్తరాంధ్ర ఇన్‌ఛార్జి విజయసాయిరెడ్డి ధర్మాన ఇంటికి వచ్చి ఆయనతో ఏకాంతంగా గంటకు పైగా చర్చించారు. ఏది ఏమైనా రెండేళ్ల తర్వాతే తన అభిప్రాయాన్ని చెబుతానని ధర్మాన అనడంతో కనీసం జగన్మోహన్‌రెడ్డి వద్దకు ఓసారి వెళ్దామన్న విజయసాయిరెడ్డి సూచనను కూడా ధర్మాన అంగీకరించనట్టు తెలుస్తుంది. అక్కడికి వెళ్లినా ఇదే మాట చెబుతానని, ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నందుకు మీరే జగన్మోహన్‌రెడ్డికి చెప్పండంటూ ధర్మాన సున్నితంగా తిరస్కరించారు. దీంతో వెంటనే ఆమదాలవలస నియోజవర్గానికి సంబంధించి తమ్మినేని సీతారామ్‌ను పిలిపించుకొని జగన్మోహన్‌రెడ్డి మాట్లాడారు. జిల్లాలో ధర్మాన సోదరుల వ్యవహారాన్ని అటు రెడ్డి శాంతి, ఇటు తమ్మినేని సీతారాం వ్యతిరేకిస్తున్నారు. అయితే జిల్లా పార్టీ అధ్యక్షుడిగా ధర్మాన కృష్ణదాస్ జిల్లా వ్యవహారాలు చూడాల్సి ఉంది కాబట్టి, ఈయన పట్ల కాస్త మెతగ్గా వ్యవహరిస్తున్నా ధర్మాన శైలి పట్ల వీరు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ధర్మాన అలక జిల్లా మొత్తం మీద ప్రభావం చూపుతుందన్న ఆలోచన పార్టీలో లేకపోలేదు. మరోవైపు వైకాపాలో కరుడుగట్టిన నేతలు ఒక్కొక్కరు తప్పుకుంటున్నారన్న సంకేతాలు అందుతున్నాయి. ఈలోగానే పార్టీని పటిష్టం చేయలేకపోతే 2027 జమిలీ ఎన్నికలకు అభ్యర్థులను తయారుచేసుకోవడం కష్టమవుతుందన్న భావనలో జగన్మోహన్‌రెడ్డి ఉన్నారు. ఇన్నాళ్లూ అభ్యర్థి ఎవరన్నది అనవసరం, తన మొహం చూసే ఓటేస్తారని భావిస్తూ వచ్చారు. కానీ అది వాస్తవం కాదని తేలడంతో ఇన్నాళ్లూ పార్టీ కోసం గట్టిగా పనిచేసి నవారిని వదులుకోడానికి జగన్మోహన్‌రెడ్డి ఇష్టపడటంలేదు. బాలినేని పార్టీ విడిచిపెట్టినప్పుడు జగన్మోహన్‌రెడ్డికి ఉన్న ధైర్యం ఇప్పుడు కనిపించడంలేదని జరిగిన పరిణామాలు చూస్తే అర్థమవుతుంది.

రాజకీయ బదిలీల కారణంగా పత్తిపాడు నుంచి తాడికొండ నియోజకవర్గంలో పోటీ చేసి భారీ తేడాతో ఓడిపోయిన మాజీ హోంమంత్రి మేకతోటి సుచరిత వైకాపాను వీడి జనసేనలో చేరుతారని ప్రచారం జరుగుతుంది. మరోవైపు జనసేనలో ఉన్నవారికి కూడా కూటమి ప్రభుత్వం మంచి కార్పొరేషన్ పదవులే ఇచ్చి గౌరవిస్తోంది. రెండో జాబితాలో 49 టీడీపీకి, 9 జనసేనకు, 2 బీజేపీకి కేటాయించారు. అలాగే మరో మాజీమంత్రి విడదల రజనీ కూడా పార్టీ మారుతారన్న ప్రచారం జరిగిన వెంటనే ఆమెకు చిలకలూరిపేట అసెంబ్లీ నియోజకవర్గానికి ఇన్‌ఛార్జిగా నియమించారు. ఈమె కూడా రాజకీయ బదిలీల్లో భాగంగా గతసారి నియోజకవర్గం మారారు. గుంటూరు-2 నుంచి పోటీ చేసి ఓడిపోయారు. ఇంకా జిల్లాను శాసించే నాయకులు పార్టీకి దూరంగా ఉంటే వచ్చిన నష్టం జగన్మోహన్‌రెడ్డికి అర్థమవు తుంది. ఇప్పటికైనా బ్యాలెన్సింగ్ రాజకీయాలు కాకుండా ఖరాఖండిగా ఒక నిర్ణయం తీసుకోవాలన్న కోణంలో జగన్మోహన్‌రెడ్డి వ్యవహరిస్తున్నారు.

---

# చదువులో రికార్డుల మోత..!

- ఆన్‌లైన్‌లో 2,500 కోర్సులు పూర్తిచేసి
- ప్రపంచ రికార్డులు సాధించిన సిక్కోలు వాసి
- ప్రఖ్యాత సంస్థల నుంచి ధ్రువపత్రాలు
- రెండేళ్ల పాటు అలుపెరగని చదువుల యజ్ఞం
- అరుదైన వరల్డ్ రికార్డుగా నమోదు



'సరదాగా మొదలుపెట్టిన చదువు ప్రయత్నం.. తర్వాత కాలంలో అలవాటుగా మారింది. నిరంతరం చదివే క్రమంలో రికార్డులను నెలకొల్పే స్థాయికి చేరింది. ఆన్‌లైన్లో ఉచితంగా భారత ప్రభుత్వం సైబర్ సెక్యూరిటీపై అందిస్తున్న కోర్సు చదివి తన కూతురుకు చెప్పేందుకు మొదలుపెట్టిన ప్రయత్నం ప్రపంచ రికార్డులను సాధించిపెట్టింది.

ఆన్‌లైన్లో ప్రఖ్యాత సంస్థలు ఉచితంగా అందిస్తున్న కోర్సులు నిరంతరం చదువుతూ.. ఆ సంస్థలు నిర్వహించిన ప్రాజెక్టులు పూర్తి చేస్తూ ఎసైన్‌మెంట్లు రాస్తూ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించడం ద్వారా ధ్రువపత్రాలు పొందుతుంటే లభించిన ఆనందంతో చదువు యజ్ఞాన్ని కొనసాగించారు. ఒకరోజు.. ఒక నెలా కాదు.. ఏకంగా రెండేళ్ల పాటు నిరంతరాయం గా ఆన్‌లైన్లో ప్రపంచ నలుమూలల్లో ఉన్న ప్రఖ్యాత సంస్థలు అందిస్తున్న కోర్సులు 2,500 పూర్తి చేసి ప్రపంచ రికార్డును సిక్కోలువాసి సొంతం చేసుకున్నారు.

భారత ప్రభుత్వం సైబర్ నేరాలపై అవగాహన కలిగించేందుకు ఆన్‌లైన్లో ఉచితంగా కోర్సును ప్రవేశపెట్టినప్పుడు తమ కుమార్తెకు బోధించేందుకు శ్రీకాకుళం నగరానికి చెందిన ఎంవీ ఎస్‌-ఎస్ శాస్త్రి ఆ కోర్సు చదివి పరీక్ష రాసి ఉత్తీర్ణులై ధ్రువపత్రాలు పొందారు. తదనంతరం ఉచితంగా ఆన్‌లైన్ కోర్సులు అందిస్తున్న సంస్థలు వివరాలను సేకరించడం పనిగా పెట్టుకొని ఒకటి కాదు.. రెండు కాదు ఏకంగా 2,500 ఆన్‌లైన్ కోర్సులు రెండేళ్ల పాటు చదివి పరీక్షల్లో ఉత్తీర్ణులై ప్రపంచ రికార్డులు నెలకొల్పడం విశేషం.







(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం నగరంలోని వి-1 రెస్టారెంట్ ఆవరణలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో శాస్త్రి మాట్లాడుతూ కోవిడ్ మహమ్మారి ప్రపంచాన్ని కుదిపేసినప్పుడు అన్ని సంస్థలు ఆన్‌లైన్లో కోర్సులను బోధించడం ప్రారంభించాయన్నారు. ఉచితంగా లభిస్తున్న ఆన్‌లైన్ కోర్సుల పట్ల ఆసక్తి కలిగి సరదాగా మొదలుపెట్టిన ప్రయత్నం విజయవంతం కావడంతో చదవాలనే ఆకాంక్ష, ఆసక్తి పెరిగిందన్నారు. ఈ క్రమంలో ప్రతిరోజూ నాలుగు నుంచి ఆరు గంటల సేపు ఆన్‌లైన్ కోర్సులు చదవడం ప్రారంభించానని శాస్త్రి తెలిపారు. 2022 అక్టోబర్‌లో మొదలైన చదువుల యజ్ఞం నేటివరకు కొనసాగిస్తూనే ఉన్నానని ఆయన పేర్కొన్నారు. ప్రపంచంలో పేరొందిన సంస్థలతో పాటు మన దేశంలోనూ పలు విశ్వవిద్యాలయాలు అందించిన ఉచిత ఆన్‌లైన్ కోర్సులను పూర్తి చేసిన క్రమంలో మిత్రుల సూచనలు మేరకు రికార్డు సంస్థలకు వివరాలు సమర్పించానన్నారు. వృత్తిపరంగా, సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తూనే క్రమం తప్పకుండా ఆన్‌లైన్ కోర్సులు పూర్తిచేసి ప్రపంచ రికార్డులు నమోదు చేయడం ఆనందంగా ఉందని శాస్త్రి తెలిపారు. నేటి పోటీ ప్రపంచంలో యువత ఏ కోర్సు చదివినప్పటికీ నైపుణ్యాన్ని పెంపొందించుకొనేందుకు ఆన్‌లైన్ లో ప్రపంచం నలుమూలల నుంచి ప్రఖ్యాత సంస్థలు ఉచితంగా అందిస్తున్న కోర్సులు సద్వినియోగపర్చుకోవడం ద్వారా ఉపాధి అవకాశాలు మరింత మెరుగుపడతాయని ఆయన సూచించారు. సాధించాలన్న తపన, పట్టుదల, నిరంతర ప్రయత్నంతో విజయం పొందగలమనడానికి తన చదువుల ప్రస్థానమే నిదర్శనమని శాస్త్రి తెలిపారు.

### సాధించిన రికార్డులు..

ఆన్‌లైన్‌లో 2,500 కోర్సులు రెండేళ్ల పాటు చదివి పూర్తిచేసిన ఎం.వి.ఎస్.ఎస్.శాస్త్రి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇండియా అచీవర్ రికార్డు, తెలుగు బుక్ ఆఫ్ రికార్డు (రెండు తెలుగు రాష్ట్రాలు) సొంతం చేసుకున్నారు. అత్యధికంగా ఆన్‌లైన్‌లో కోర్సులు పూర్తిచేసిన వ్యక్తిగా శాస్త్రి పేరు నమోదుచేసి ధ్రువపత్రాలను రికార్డు సంస్థలు ప్రదానం చేశాయి. గిన్నిస్ రికార్డు నమోదుకు దరఖాస్తు సమర్పించిన క్రమంలో ఆ బృందం ధ్రువపత్రాల పరిశీలన కొనసాగిస్తోంది.




### అంతర్జాతీయ సంస్థల కోర్సులు..

ఆన్లైన్ అంతర్జాతీయ సంస్థలైన గూగుల్, మైక్రోసాఫ్ట్, అమెజాన్, ఐబీఎం, లింక్డ్‌ఇన్, ఫేస్‌బుక్, మెటా, ఆటోడెస్క్, ఓషా, ఏషియన్ డెవలప్మెంట్ బ్యాంక్, కార్పొరేట్ ఫైనాన్స్ ఇనిస్టిట్యూట్, యుడేమి, ఈడీఎక్స్, ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ (ఐఎల్వో), ఇంటర్నేషనల్ ట్రైనింగ్ సెంటర్ (ఐటీసీ), యూరోపియన్ ఓపెన్ యూనివర్శిటీ, వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ (డబ్ల్యుహెచ్వో), యునిసెఫ్, కోర్సు ఎరా, కర్సా, యూకే అకాడమీ, ఫ్యూచర్ లెర్న్, ఒరగాన్ (యుఎస్ఏ) యూనివర్శిటీ, ఫోర్ఎజ్, యాక్సెంచర్, వాల్మార్ట్, యూనివర్శిటీ ఆఫ్ లీడ్స్, యూనివర్శిటీ ఆఫ్ మెల్బోర్న్, బ్రిటిష్ కౌన్సిల్, న్యూసౌత్వేల్స్ (ఆస్ట్రేలియా) యూనివర్శిటీ, బ్రిటిష్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్, డిలైట్, కాగజేంట్, ఆక్స్‌ఫర్డ్ హోంస్టడీ, అలిసన్, లెక్ట్రా, గ్యాస్పల్ ఇనిస్టిట్యూట్, ఓపెన్ లెర్నింగ్, మైండ్లస్టర్ సంస్థల నుంచి సాఫ్ట్వేర్‌కి సంబంధించిన కోర్సులతో పాటు స్కిల్ డెవలప్మెంట్, బిజినెస్ మేనేజ్మెంట్, సైకాలజీ, బిజినెస్ అడ్మినిస్ట్రేషన్, జర్నలిజం, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సీ, మిషన్ లెర్నింగ్.. విద్యారంగంలో ఉన్న అన్ని విభాగాలకు చెందిన కోర్సులు పూర్తి చేయడం విశేషం.

### భారతీయ సంస్థలు..

గవర్నమెంట్ ఆఫ్ ఇండియా (మినిస్ట్రీ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటీ), ఐఐటీ మద్రాస్, ఎన్‌పిటిఈఎల్, లాల్ బహదూర్ శాస్త్రి యూనివర్శిటీ, టీసీఎస్, ఇన్ఫోసిస్, హెచ్‌పి, డిజిటల్ అడ్డా, సింప్లీలెర్న్, ట్రిపుల్ ఐటీ (కోటా) రాజస్థాన్, ఫార్మా అకాడమీ, యుడెనెక్స్, గువీ, హెచ్‌సిఎల్, నాస్కామ్, స్కిల్ అప్, సిస్కో, ఎక్సెల్ చాంప్, పిట్రోనిక్స్, లెట్స్ అప్ గ్రేడ్, డిజాస్టర్ మేనేజ్మెంట్, ఇంటెల్, ఎనర్జీ స్వరాజ్, యాక్సెస్ బాంక్, ట్యుటోరియల్ పాయింట్ తదితర సంస్థల నుంచి కోర్సులు, ధ్రువపత్రాలు పొందారు.

### ప్రత్యేక శిక్షణలు..

సాఫ్ట్‌వేర్ రంగంలో పేరొందిన గూగుల్‌తో పాటు టీసీఎస్, మైక్రోసాఫ్ట్ ప్రవేశపెట్టిన ఛాలెంజ్, ట్రైనింగ్ కోర్సులను పూర్తిచేసి వాటి నుంచి ప్రత్యేక అభినందనలను పొందారు. టీసీఎస్ డిజిటల్ సూపర్ స్టార్ ట్రైనర్, మైక్రోసాఫ్ట్ గ్లోబెల్ అకాడమీ, మైక్రోసాఫ్ట్ టీచర్ అకాడమీ నుంచి ప్రశంసలను శాస్త్రి పొందారు.

### మెటా ఏఐకి పాఠాలు..

ప్రఖ్యాత మెటా సంస్థ వాట్సాప్‌లో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ)ను ప్రవేశపెట్టిన క్రమంలో జిల్లాకు చెందిన పలు చారిత్రక అంశాలతో కూడిన సమాచారాన్ని మెటా ఏఐకు శాస్త్రి నిరంతరం అందిస్తున్నారు. మెటా సంస్థ వాట్సాప్‌లో నీలిరంగు ఐకాన్‌తో ఏఐను ప్రవేశపెట్టిన క్రమంలో జిల్లాలో పలు విశేషాలు, సమాచారాన్ని ఏఐకు అడిగినప్పుడు సరైన సమాచారం లభించలేదు. ఈ క్రమంలో జిల్లాకు చెందిన చారిత్రక, సాహిత్య, సాంస్కృతిక, రాజకీయ సమాచారం, ప్రస్తుత పరిస్థితులను ప్రతిరోజూ ఒక గంటసేపు మెటా ఏఐకు అందించే పని శాస్త్రి చేస్తున్నారు. జిల్లాకు చెందిన సమాచారాన్ని ఎవరైనా శోధించినప్పుడు పక్కాగా ఫలితం రావాలనే తాను ఏఐకు శాస్త్రీయంగా కూడిన సమాచారాన్ని ఉచితంగా అందిస్తున్నానని ఆయన తెలిపారు.

• ఎడిటోరియల్

# మగాళ్లు కంటేనే నొప్పి తెలుస్తుంది!

కాలం చెక్కిలిపై ఘనీభవించిన ఒంటరి కన్నీటి చుక్క తాజమహల్ అంటాడు రవీంద్రనాథ్ ఠాగూర్ అద్భుతమైన కట్టడం, ప్రేమ మందిరంగా ప్రసిద్ధి చెందిన తాజ్‌మహల్ కోసం. 19 సంవత్సరాల వివాహ బంధంలో, 14 మంది సంతానాన్ని కన్నది షాజహాన్ భార్య ముంతాజ్ మహల్. ఇందులో ఏడుగురు పిల్లలు పసికందులుగానే మరణించారు. 36 గంటలపాటు పురిటినొప్పులతో అల్లాడి, 14వ బిడ్డ గౌహర్ బేగంకి జన్మనిస్తూ, అధిక రక్తస్రావంతో ముంతాజ్ మహల్ 1631లో మరణించింది. ఆ కాసిన్నేళ్ల సంసార జీవితంలోనే మహారాణి, గర్భాన 14 మంది సంతానాన్ని పుట్టించిన షాజహాన్ మహారాజు, చివరికి భార్య జ్ఞాపకంగా ఆ మహా కట్టడపు శాశ్వత సమాధిని ఆమె కోసం నిర్మించాడు. అతి చిన్న వయసులోనే అంత హింసను అనుభవించి, అన్నేసి గర్భాలను మోసి, రక్తస్రావంతో ముంతాజ్ మహల్ ఎందుకు మరణించాల్సి వచ్చింది అన్న సంగతి లోకానికి ఎన్నడూ పట్టలేదు. స్త్రీలు కేవలం సంతానాన్ని ఉత్పత్తి చేసే గర్భాలు మాత్రమేనా, వాళ్లు మనుషులు కాదా, వాళ్ల శరీరం వాళ్లది కాదా, తమ శరీరం పైన, తమ పునరుత్పత్తి శక్తి పైన వాళ్లకు హక్కు లేదా? ఒకవేళ, మేమిక పునరుత్పత్తి చేయమని స్త్రీలు తిరగబడితే మానవజాతి ఏమవుతుంది వంటి ప్రశ్నలు ఆనాటి నుండి, ఇప్పటివరకు కూడా ఈ సమాజానికి, పురుషులకు, మన కుటుంబాలకు పట్టలేదు. కాబట్టే, మొన్నటికి మొన్న తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ అక్టోబర్ 20న 'పార్లమెంటు స్థానాలు మనకు తగ్గిపోతున్న తరుణంలో 16 మంది పిల్లల్ని ఆడవాళ్లు ఎందుకు కనకూడదు' అని అన్నాడు. అంటే, ఆయన మాట ప్రకారం ముంతాజ్ మహల్ కంటే మరో ఇద్దరిని ఎక్కువ మంది పిల్లలని ఈ 'ఆధునిక మహిళలు' కనాలన్న మాట. అలా ముంతాజ్ మహల్లా బిడ్డల్ని కంటూ, కంటూ మరణించే ఆడవాళ్ల కోసం తమిళనాడులో ఎన్ని తాజ్‌మహల్‌లు ఆయన సిద్ధం చేస్తున్నాడో ఏమో మనకు తెలియదు. కానీ, మహిళలకు ఇలాంటి పిలుపులు ఇస్తున్న ఆయనకు మాత్రం ఇద్దరు పిల్లలే ఉన్నారు. ఇక అక్టోబర్ 19న చంద్రబాబు ఇద్దరు కన్నా ఎక్కువ మంది పిల్లల్ని కనాలని, తక్కువ మంది పిల్లలున్న వారిని స్థానిక సంస్థల ఎన్నికలలో పోటీ చేయడానికి అనర్హులను చేసేలా ఒక చట్టాన్ని తీసుకువస్తామని అన్నారు. నిజానికి ఇలాంటి మాటలను చంద్రబాబు 2014 నాటి నుంచే మాట్లాడుతున్నారు. చంద్రబాబు నాయుడుకి కూడా ఏకైక కుమారుడు లోకేష్ మాత్రమే ఉన్నారు. ప్రకృతి ఇలాంటి పనిని స్త్రీలకు ఇచ్చింది కానీ, పురుషులకే గర్భాలు వచ్చే స్థితి వుంటే ఇలాంటి వాచాలతను రాజకీయ నాయకులు ప్రదర్శించేవారా? ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాలకు ఆర్థిక, రాజకీయ, సాంఘిక, సాంస్కృతికపరమైన అనేక అంశాల్లో అనేక తేడాలు ఉన్నాయి. అంతేకాకుండా, ఉత్తరాది రాష్ట్రాల కన్నా దక్షిణాది రాష్ట్రాలు ఆరోగ్యం, విద్య, ఆర్థిక వనరులు, ఉపాధి అవకాశాలు, పరిశ్రమలు, మౌలిక సదుపాయాలు, అభివృద్ధి ఇటువంటి అంశాలలో ఎంతో మెరుగ్గా ఉన్నాయి. ఈ రాష్ట్రాలలో గత అనేక ఏళ్లుగా అనుసరించిన పాలసీలు కూడా ఈ ముందడుగుకి ఒక కారణం. 2026 నాటికి జనాభా శాతం ఇప్పటికన్నా మరింత తగ్గుతుంది కాబట్టి ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం ఉన్న 25 లోక్‌సభ స్థానాలు 20కి, తెలంగాణలో ప్రస్తుతం ఉన్న 17 సీట్లు 15కు, తమిళనాడులో 39 సీట్లు 30కి, కేరళలో 28 సీట్లు 26కి, కర్ణాటకలో 20 సీట్లు14కు తగ్గే అవకాశం ఉందని ఒక అంచనా. జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్‌ను గనుక చేస్తే, చట్టసభలలో శాశ్వతంగా ఉత్తరాది రాష్ట్రాలకి మెజారిటీ దక్కుతుంది. కాబట్టి వాటికీ అనుకూలమైన పాలసీలను, చట్టాలను మెజారిటీ పేరుతో చేసుకోవడం సులువు అవుతుంది. స్టాలిన్, చంద్రబాబు ఉద్దేశాలు వేరైనా, వారిలానే అనేక సందర్భాలలో ఆర్ఎస్ఎస్, బిజెపి నాయకులు కూడా భారతీయ సంస్కృతిని, నాగరికతను కాపాడటం కోసం, హిందూ సమాజ హితం కోసం, పెరిగిపోతున్న ముస్లిం జనాభాను అడ్డుకునేందుకు ఎక్కువ మంది పిల్లల్ని కనాలని హిందూ స్త్రీలకు పిలుపునిచ్చారు. ప్రపంచంలోనే నేషనల్ ఫ్యామిలీ ప్లానింగ్ ప్రోగ్రాంను ప్రారంభించిన మొట్టమొదటి దేశం భారతదేశం. యునిసెఫ్ ఇటీవలి నివేదిక ప్రకారం, భారత దేశంలో వున్న లింగవివక్ష ఫలితంగా 50లక్షల మంది బాలికలు, స్త్రీలు భారత జనాభా నుంచి అదృశ్యమవుతున్నారు. మన దేశంలో ప్రతీ రోజూ చట్టవిరుద్ధంగా 2వేల ఆడ శిశు గర్భస్రావాలు జరుగుతున్నట్లు ఒక అంచనా. అంతేకాదు, అత్యధిక ప్రసూతి మరణాలు జరిగిన దేశాల్లో భారతదేశం ప్రపంచంలోనే రెండో స్థానంలో నిలిచింది. ఇలా ఆడబిడ్డలను చంపేయకుండా భూమి మీదకు తెస్తే జనాభా ఎందుకు తగ్గుతుంది? దక్షిణాదిలోనే మహిళా శాతం ఎందుకు తక్కువుంది? అనేది ఆలోచించాల్సిన అంశం.

# అభివృద్ధి కూటమి ప్రభుత్వ ధ్యేయం



(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

- ఎమ్మెల్యేలు గొండు శంకర్, నడుకుదిటి ఈశ్వరరావు
- బస్సు షెల్టర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యేలు

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని శ్రీకాకుళం, ఎచ్చెర్ల ఎమ్మెల్యేలు గొండు శంకర్, నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. ఎచ్చెర్లలో బస్సు షెల్టర్‌ను ఎమ్మెల్యే శంకర్ శనివారం ప్రారంభించారు.



ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ప్రజల్లో ఆనందోత్సవాలు నెలకొన్నాయన్నారు. కూటమి ప్రభుత్వం నాయకుల మధ్య విభేదాలు సృష్టించి పబ్బం గడుపుకోవాలని వైకాపా నాయకులు చూస్తున్నారని, అది ఎప్పటికీ సాధ్యం కాదని ఎమ్మెల్యేలు అన్నారు. గ్రామాల్లో ఎక్కడికక్కడ సమస్యలు పేరుకుపోయాయని, వాటిని పరిష్కరించడమే లక్ష్యంగా కలిసికట్టుగా ముందుకు సాగుతున్నామని వివరించారు. ప్రయాణికుల సౌకర్యార్థమే బస్‌షెల్టర్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# పీడీఎస్ బియ్యం పట్టివేత

(సత్యంన్యూస్, కొత్తవలస)



అక్రమంగా రవాణా చేస్తున్న 440 బస్తాల్లో 22,380 కిలోల పీడీఎస్ బియ్యాన్ని కొత్తవలస జంక్షన్ వద్ద విజిలెన్స్, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా పట్టుకున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ, విజిలెన్స్ డీజీ హరీష్ కుమార్ గుప్తా ఆదేశాల మేరకు, ప్రాంతీయ నిఘా, అమలు అధికారి బి.ప్రసాదరావుకు వచ్చిన ముందస్తు సమాచారంతో పీడీఎస్ బియ్యన్ని అక్రమ రవాణా చేస్తున్న ఏపీ 27 టీటీ 3267 అనే నెంబర్ గల లారీని పట్టుకున్నారు. లారీ డ్రైవర్ బొడ్డు కొండలరావును ప్రశ్నించగా, సదరు బియ్యం వేపాడ మండలం రామస్వామిపేటలోని శ్రీ లక్ష్మీ శ్రీనివాస రైస్‌మిల్లు యజమాని పొరపు రెడ్డి రామరావు ప్రజల వద్ద నుంచి సేకరించి పెద్దిపాలెంలో ఉన్న శ్రీ సాయి బాలాజీ మోడ్రన్ రైస్‌మిల్లుకు రవాణా చేస్తున్నట్టు తెలిపారు. అధికారులు రూ.10,18,290 విలువ గల పిడిఎస్ బియ్యాన్ని, లారీని సీజ్ చేసి సంబంధిత అక్రమ రవాణాదారులపై కేసు నమోదు చేశారు. అనంతరం సంబంధిత లక్ష్మీ శ్రీనివాస రైస్ మిల్లులో తనిఖీలు నిర్వహించారు. ఈ దాడిలో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ సతీష్‌కుమార్, కొత్తవలస పౌర సరఫరాల ఉప తహశీల్దార్ రామకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భగా విజిలెన్స్ ఎస్పీ బి.ప్రసాదరావు మాట్లాడుతూ పీడీఎస్ అక్రమ రవాణాదారులపై నిఘా ఉంచామని, పట్టుబడిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.



## 10న జిల్లా స్థాయి చిత్రలేఖన పోటీలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రోటరీ క్లబ్ శ్రీకాకుళం, శరత్‌చంద్ర అకాడమీ విజయవాడ, ఇన్‌స్పిరా అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో శ్రీకాకుళం పట్టణంలో హౌసింగ్ బోర్డ్ కాలనీలోని ఇన్‌స్పిరా పాఠశాలలో ఈనెల 10న ఆదివారం ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు జిల్లా స్థాయి చిత్రలేఖన పోటీలు, సోలో స్పెషల్ టాలెంట్ ప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నామని క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు ముని శ్రీనివాసరావు, దూసి సంతోష్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. చిత్రలేఖన పోటీలకు వచ్చే విద్యార్థులకు అవసరమైన మెటీరియల్ నిర్వాహకులు పంపిణీ చేస్తారని, ఎనిమిదేళ్ల నుంచి 15 ఏళ్ల వయసు గల పాఠశాల విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొనవచ్చున్నారు. పోటీలో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ నగదు బహుమతులు, కన్సోలేషన్ బహుమతులతో పాటు పాల్గొన్న ప్రతి విద్యార్థికి ప్రోత్సాహక ప్రశంసా పత్రాలు ఈ నెల 14న బాలల దినోత్సవం సందర్భంగా బహుకరిస్తామన్నారు. వివరాలకు కోఆర్డినేటర్, రోటరీ ప్రతినిధి అన్నెపు అనంతరావు 70937 74050, 70757 55060 నెంబర్లకు సంప్రదించాలని వారా ప్రకటనలో తెలిపారు.

## రాత్రి 12 వరకు హోటల్స్ తెరిచేలా జీవో అమలుచేయండి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ప్రతిరోజు రాత్రి 12 గంటల వరకు రెస్టారెంట్స్ & హోటల్స్ అన్ని తెరచివుంచేలా జీవో పాస్ చేయాలని రాష్ట్ర డీజీపీ ద్వారకాతిరుమలరావును ఆంధ్రప్రదేశ్ హోటల్స్ అసోసియేషన్ తరఫున అసోసియేషన్ అధ్యక్షులు ఆర్‌వీ స్వామి, సెక్రటరీ నాగరాజు, ట్రెజరర్ పూర్ణ, విజయవాడ హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షులు రమణ, సెక్రటరీ రాఘవ కోరారు. ఈమేరకు శుక్రవారం ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌వ్యాప్తంగా ప్రతిరోజు రాత్రి 12 గంటల వరకు రెస్టారెంట్స్ & హోటల్స్ అన్ని తెరచి ఉంచాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సెప్టెంబర్ 27న వరల్డ్ టూరిజం డే సందర్భంగా జరిగిన సాంస్కృతిక కార్యక్రమంలో బహిరంగంగా మాట ఇచ్చిన విషయం గుర్తుచేశారు. 2018లోనే అప్పటి ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు జీవోని పాస్ చేశారని, ఆ జీవోను ఇంప్లిమెంట్ చేసేలా అన్ని జిల్లాల పోలీస్ ఉన్నతాధికారులకు ఆదేశాలు ఇవ్వాలని డీజీపీని వారు కోరారు.






యువ కథానాయకుడు నిఖిల్ సిద్ధార్థ్ నుంచి చడీచప్పుడు లేకుండా వచ్చిన సినిమా.. అప్పుడో ఇప్పుడో ఎప్పుడో. తనతో 'స్వామి రారా' లాంటి మంచి థ్రిల్లర్ తీసిన సుధీర్ వర్మ ఈ చిత్రాన్ని రూపొందించాడు. 'సప్త సాగరాలు దాటి' ఫేమ్ రుక్మిణి వసంత్ ఈ చిత్రంతో టాలీవుడ్లో అడుగుపెట్టింది. ఈ రోజే ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్ర విశేషాలేంటో చూద్దాం పదండి.

కొన్ని సినిమాల రిలీజ్ టైమింగ్.. వాటి ప్రోమోలు.. ప్రమోషన్ల తీరు చూస్తేనే వాటి ఫలితం మీద ముందే ఒక అంచనా వచ్చేస్తుంది. ఆ సినిమాలు బాగుంటే ఆశ్చర్యపోయే పరిస్థితి తలెత్తుతుంది. మంచి అభిరుచి ఉన్న హీరో.. విషయం ఉన్న దర్శకుడు కూడా ఏ కథను సినిమాగా చేయాలి.. ఏది చేయకూడదు అనేది అర్థం కాని అయోమయంలో కొన్నిసార్లు తప్పటడుగులు వేస్తుంటారు. కానీ మొదలుపెట్టాక మధ్యలో ఆపలేరు. పూర్తి చేశాక సినిమా రిలీజ్ కాకుండా అడ్డుకోనూలేరు. 'స్వామి రారా' లాంటి ట్రెండ్ సెట్టింగ్ థ్రిల్లర్ చేసిన నిఖిల్ సిద్ధార్థ-సుధీర్ వర్మల క్రేజీ కాంబినేషన్లో వచ్చిన 'అప్పుడో ఇప్పుడో' ఈ కోవకే చెందుతుంది.

సాంకేతిక వర్గం: 'అప్పుడో ఇప్పుడో ఎప్పుడో'కు సాంకేతిక హంగులు పర్వాలేదనిపిస్తాయి. కార్తీక్ పాటలు వినసొంపుగా లేవు. అసలు పాటలే అవసరం లేని సినిమా ఇది. సన్నీ ఎంఆర్ నేపథ్య సంగీతం మాత్రం బాగానే సాగింది. రిచర్డ్ ప్రసాద్ కెమెరా పనితనం కూడా ఓకే. చాలా వరకు కథ లండన్లోనే నడుస్తుంది. ఆ నేపథ్యంలో సన్నివేశాలు బాగానే తీశాడు. నిర్మాణ విలువలు ఓకే. లండన్ బ్యాక్ డ్రాప్ వల్ల సినిమా రిచ్ గానే అనిపిస్తుంది. ఐతే ఈ సినిమాకు సమస్యంతా స్క్రిప్టులోనే ఉంది. 'స్వామి రారా' తర్వాత ఆ స్థాయి పకడ్బందీ థ్రిల్లర్ తీయలేకపోయిన సుధీర్ వర్మ.. ఈసారి మరీ తేలికైన స్క్రిప్టుతో సినిమా చేశాడనిపిస్తుంది. సుధీర్ చివరి సినిమా 'రావణాసుర'కు పేలవమైన కథ అందించిన శ్రీకాంత్ విస్సా.. మరోసారి అలాంటి వీక్ స్టోరీనే అందించాడు. దానికి సుధీర్ కూడా తన మార్కు రేసీ స్క్రీన్ ప్లేని జోడించలేకపోయాడు. క్రైమ్ ఎలిమెంట్ చుట్టూ బిగితో కథనాన్ని అల్లుకోవడంలో సుధీర్ అండ్ టీం ఫెయిలైంది. కథతో పాటు పాత్రల్లో ఇంటెన్సిటీ లేకపోవడం మైనస్ అయింది. రచయితగా.. దర్శకుడిగా సుధీర్ నిరాశపరిచాడు.

# టోటల్ బోర్!

నటీనటులు: నిఖిల్ తన పరిధిలో రిషి పాత్రను బాగానే చేశాడు. సినిమాలో ప్రేక్షకులను అంతో ఇంతో ఎంగేజ్ చేసేది అతనే. పాత్ర ఎలాంటిదైనా సిన్సియర్ ఎఫర్ట్ పెట్టే నిఖిల్.. తన వరకు మెప్పించాడు. హీరోయిన్ రుక్మిణి వసంత్ క్యూట్ లుక్స్ తో ఆకట్టుకుంది. తన నటన కూడా ఓకే. మరో హీరోయిన్ దివ్యాంశ కౌశిక్ ఇందులో పేలవమైన పాత్ర చేసింది. కన్నింగ్ క్యారెక్టర్ని సరిగా డిజైన్ చేయకపోవడంతో అది తేలిపోయింది. జాన్ విజయ్ లాంటి టిపికల్ యాక్టర్ని మన వాళ్లు సరిగా ఉపయోగించుకోలేకపోతున్నారనడానికి ఈ సినిమా మరో రుజువు. జాన్ బాగా పెర్ఫామ్ చేసినా సరే.. ఆయన పాత్ర చికాకు పెడుతుంది. అజయ్ తనకు అలవాటైన నెగెటివ్ క్యారెక్టర్లో ఏదో అలా చేసుకుపోయాడు. హీరో ఫ్రెండు పాత్రలో హర్ష చెముడు రొటీనే. సినిమాలో కథను నరేట్ చేసే దొంగల పాత్రల్లో సత్య.. సుదర్శన్ కూడా అంతగా నవ్వించలేకపోయారు. కానీ సత్య నటన మాత్రం బాగానే సాగింది.

**కథనం-విశ్లేషణ:**

ఇది ఎప్పుడో కొవిడ్ టైంలో మొదలైన సినిమా. షూటింగ్ ఎప్పుడు పూర్తయిందో ఏమో కానీ.. ఉన్నట్లుండి రిలీజ్ అనౌన్స్ చేశారు. దీని టీజర్.. ట్రైలర్ పెద్దగా ఆసక్తి రేకెత్తించలేకపోయాయి. బాధ్యతగా ప్రమోషన్లు అయితే చేశారు కానీ.. ఇటు నిఖిల్-అటు సుధీర్ ఇద్దరిలోనూ ఎప్పుడూ కనిపించే కాన్ఫిడెన్స్ అయితే ఈ సినిమా విషయంలో కనిపించలేదు. ఈ నేపథ్యంలో చాలా తక్కువ అంచనాలతోనే 'అప్పుడో ఎప్పుడో ఎప్పుడో' థియేటర్లలో అడుగు పెడతాం. కానీ ఎంత తక్కువ అంచనాలతో చూసినా కూడా నిరాశపరిచే స్థాయి ఈ సినిమా ఉండడమే విచారకరం.

'స్వామి రారా'తో థ్రిల్లర్ అంటే ఇలా ఉండాలి అనిపించిన నిఖిల్-సుధీర్ జోడీ.. ఈసారి థ్రిల్లర్ సినిమా ఎలా ఉండకూడదో చూపించడానికి 'అప్పుడో ఇప్పుడో ఎప్పుడో' తీశారేమో అనిపిస్తుంది. ఈ కలయికలో వచ్చిన తొలి చిత్రంలో ఉన్న ఏ మంచి లక్షణమూ ఇందులో కనిపించదు. చెప్పుకోదగ్గ కథ లేదు. బలమైన పాత్రలు లేవు. కథనంలో వేగం కనిపించదు. థ్రిల్స్ అసలే లేవు. ఇటు లవ్ ట్రాక్.. అటు క్రైమ్ ఫ్యాక్టర్ రెండూ కూడా తేలిపోయాయి. రెండు గంటల తక్కువ నిడివి ఉన్నా సరే.. లెంగ్త్ పరంగా ఓ పెద్ద సినిమా చూసిన భావన కలిగించడాన్ని బట్టి 'అప్పుడో ఇప్పుడో ఎప్పుడో' ఎంత 'రేసీ'గా సాగుతుందో అర్థం చేసుకోవచ్చు. సుధీర్ నుంచి ఇంతకు ముందు కూడా అంచనాలకు తగని సినిమాలు వచ్చాయి కానీ.. ఇంత నత్తనడకన సాగిన సినిమా మరొకటి లేదని చెప్పొచ్చు. సినిమాలో ఏ పాత్రా ఆసక్తికరంగా సాగకపోవడం.. విలన్ పాత్ర మరీ తేలిపోవడంతో ఈ సినిమా కనీస స్థాయిలో కూడా ప్రేక్షకులను ఎంగేజ్ చేయలేకపోయింది. క్రైమ్ ఎలిమెంట్‌ను ప్రేక్షకులు సీరియస్‌గా తీసుకోని విధంగా సిల్లీగా డీల్ చేయడం పెద్ద మైనస్ అయింది.

'అప్పుడో ఇప్పుడో ఇప్పుడో'లో మెయిన్ విలన్ పాత్ర చేసిన తమిళ నటుడు జాన్ విజయ్ లండన్లో ఇల్లీగల్ బిజినెస్ చేసే డాన్. ఏదైనా తేడా వస్తే ఎంతమందినైనా పిట్టల్లా కాల్చేసే క్రూరుడిగా పరిచయం చేస్తారు. ఐతే జస్ట్ అక్కడి వరకు పరిమితం చేస్తే పాత్రలో వైవిధ్యం ఉండదు అనుకున్నారో ఏమో.. అతడికో విచిత్ర వేషధారణ.. హావభావాలు పెట్టి.. నడివయస్కుడైన అతను అమ్మాయిలను ఫ్లర్ట్ చేసే రొమాంటిక్‌ఫెలో లాగా చూపించడానికి ప్రయత్నించారు. ఇంకా రకరకాలుగా ఆ పాత్రను ట్విస్ట్ చేశారు. ఈ క్రమంలో ఆ పాత్ర కలగాపులగంగా తయారై జోకర్ లాగా తయారైంది. ఈ పాత్రను తీర్చిదిద్దిన విధానం.. తన మీద తీసిన సీన్లు చూశాక ఇతను డానేంటి.. వందల కోట్లు డీల్ చేయడమేంటి అని ప్రేక్షకులు లైట్ తీసుకునే పరిస్థితి వస్తుంది. దాని వల్ల కథను కూడా ప్రేక్షకులు సీరియస్‌గా తీసుకోలేకపోతారు. క్రైమ్ ఎలిమెంట్లో ఎక్కడా కూడా ఇంటెన్సిటీ కనిపించదు. పాత్రలను.. కథను కన్వీనియెంట్‌గా ట్విస్ట్ చేసేస్తుంటారు కానీ.. ఏదీ కన్విన్సింగ్‌గా అనిపించదు. ఇద్దరు హీరోయిన్లలో వేర్వేరుగా హీరో 'పెళ్లి' తంతుకు సంబంధించిన సన్నివేశాలు చూస్తే 'అప్పుడో ఇప్పుడో ఎప్పుడో'ను ఎంత తేలిగ్గా తీసేశారో అర్థమవుతుంది. ప్రథమార్ధంలో అసలు కథే కనిపించని ఈ సినిమాలో రొమాంటిక్ ట్రాక్ బోర్ కొట్టించేస్తుంది. విరామం దగ్గర్నుంచి సినిమా థ్రిల్లర్ రూట్ తీసుకుంటుంది. కానీ అదీ ఎంగేజింగ్ గా అనిపించదు. ఇందులో పేరుకే ట్విస్టులున్నాయి. కథలో సీరియస్నెస్ లేకపోవడం వల్ల అవి ప్రేక్షకులను థ్రిల్ చేయవు. తర్వాత ఏం జరుగుతుందనే ఆసక్తే రేకెత్తించని విధంగా ఏవో సన్నివేశాలు వస్తుంటాయి పోతుంటాయి. ముగింపులో కూడా పెద్దగా మెరుపుల్లేని 'అప్పుడో ఇప్పుడో ఎప్పుడో' నిఖిల్-సుధీర్ కాంబినేషన్లో ఇలాంటి సినిమా ఏంటనే ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది.

కథ: రిషి (నిఖిల్ సిద్దార్థ) రేస్ డ్రైవర్‌గా ఎదగాలని కలలు కనే కుర్రాడు. ఆ ప్రయత్నంలో ఉండగా తార (రుక్మిణి వసంత్)ను చూసి ప్రేమలో పడతాడు. ఆమె కూడా తనను ప్రేమిస్తుంది. కానీ తన ఫ్రెండు చేసిన తప్పు వల్ల తార తనను ప్రేమించట్లేదని పొరపాటు పడి తాను ఉంటున్న హైదరాబాద్‌ను వదిలి లండన్ వెళ్లిపోతాడు. అక్కడ అతడికి తులసి (దివ్యాంశ కౌశిక్) అనే మరో అమ్మాయి పరిచయం అవుతుంది. కొన్నాళ్ల పాటు తనతో ప్రేమాయణం సాగించాక ఆమె మోసం చేసి వెళ్లిపోతుంది. ఇంతలో తార లండన్లో తారసపడడంతో రిషి మళ్లీ తనకు దగ్గ రవుతాడు. వీరి ప్రేమ కథ మళ్లీ ఒక కొలిక్కి వస్తున్న సమయం లో తులసి తిరిగి రిషి దగ్గరికి వస్తుంది. దీంతో తార అతణ్ని వదిలి వెళ్లిపోతుంది. మరోవైపు తులసి రిషి దగ్గరికి వచ్చిన కాసేపటికే ఆమె హత్యకు గురవుతుంది. దీంతో రిషి అన్ని రకాలుగా ఇబ్బందుల్లో పడతాడు. ఇంతకీ తులసిని చంపిందెవరు.. దీని వెనుక మిస్టరీ ఏంటి.. ఈ సమస్యల నుంచి బయటపడి తారను రిషి తన దాన్ని చేసుకున్నాడా లేదా అన్నది మిగతా కథ.

- తుపాకి.కామ్ సౌజన్యంతో...

## పోలింగ్ కేంద్రాలను సందర్శించిన టీడీపీ నేతలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ ఆదేశాల మేరకు పట్టణంలో పిఎస్ఎన్ఎమ్ స్కూలులో 263, 264, 265 పోలింగ్ కేంద్రాల ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాలను టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు పిఎంజె బాబు, బూత్ ఇన్‌ఛార్జి, జిల్లా ఐటీడీపీ అధ్యక్షులు ప్రధాన విజయరాం శనివారం సందర్శించి పరిశీలించారు. ఈ నెల 23, 24 తేదీల్లో బూత్ లెవెల్ అధికారులు ప్రతీ పోలింగ్ కేంద్రాల వద్ద అందుబాటులో ఉండి ఓటర్లు జాబితాలో చేర్పులు, తొలగింపులు, సవరణలకు ఫారం 6,7,8లో దరఖాస్తులు స్వీకరిస్తారని, ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఎల్ఓలు పాల్గొన్నారు.





విద్యుత్ బిల్ చెల్లించడం ఇప్పుడు మరింత సులభతరం అయ్యిందని లావేరు మండలం తామాడ గ్రామ సచివాలయ ఎనర్జీ అసిస్టెంట్ (లైన్‌మెన్) ఎస్. గణేష్ తెలిపారు. విద్యుత్ శాఖాధికారులు ఆదేశాలతో విద్యుత్ బిల్ క్యూఆర్ కోడ్‌పై శనివారం లావేరు మండలం తామాడ పంచాయతీ సూర్యనారాయణపురం గ్రామస్తులకు అవగాహన కల్పించారు. విద్యుత్ బిల్‌లో క్యూఆర్ కోడ్ తో విద్యుత్ బిల్ స్వతహాగా చెల్లింపులు చేసే అవకాశం ప్రభుత్వం కల్పించిందని ఈ అవకాశం సద్వినియోగం ప్రజలందరూ చేసుకోవాలని అన్నారు. బిల్ రీడర్ సాయి ఉన్నారు. – సత్యంన్యూస్, లావేరు



గ్రామీణ ప్రజల చైతన్యానికి ఉన్నత్ భారత్ అభియాన్ పథకం దోహదం చేస్తుందని జిఎంఆర్ ఐటీ ప్రిన్సిపాల్ డా.సిఎల్.వి.ఆర్.ఎస్.వి.ప్రసాద్ అన్నారు. శనివారం రేగిడి మండలం బాలకవి వలస గ్రామంలో ఉన్నత భారత్ అభియాన్‌పై అవగాహన కల్పించారు. విద్యార్థులు మొదట గ్రామంలో కుటుంబ సర్వే నిర్వహించి, ప్రధాన సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉన్నత భారత్ అభియాన్ కళాశాల కో–ఆర్డినేటర్ డా.డి.తేజేశ్వర రావు, గ్రామ సర్పంచ్ వావిలపల్లి చంద్రశేఖర్, కార్తీక్, గ్రామ ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు. – సత్యంన్యూస్, రాజాం



శ్రీకాకుళం నగర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మాదారపు వెంకటేష్ తన జన్మదిన సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ, పాడిపరిశ్రమ, పశుసంవర్ధక సహకార, మార్కెటింగ్, మత్స్య శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును ఆయన క్యాంప్ ఆఫీసులో కలిశారు. ఈ సందర్భంగా అచ్చెన్న కేక్ కట్ చేసి తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. – సత్యంన్యూస్, టెక్కలి

## పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలి




(సత్యంన్యూస్, పలాస)

టీడీపీ నాయకత్వంలో కూటమి ప్రభుత్వం వైకాపా విధానాల్ని కొనసాగిస్తే ప్రజల నుండి ప్రతిఘటన తప్పదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను ఉపసంహరించుకోకపోతే ఉద్యమం తప్పదని హెచ్చరించారు. సీపీఎం 18వ జిల్లా మహాసభలు సందర్భంగా పలాస నగరంలో పలాస ఆర్టీసీ కాంప్లెక్స్ నుండి పాత బస్టాండ్ వారికి భారీ ర్యాలీ అనంతరం బహిరంగ సభ నిర్వహించారు. సిపిఎం నాయకులు కోనారి మోహనరావు అధ్యక్షతన జరిగిన సభ నిర్వహించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఇప్పటికే సర్దుబాటు చార్జీలు 6,072 కోట్లు మోపి ఇప్పుడు కొత్తగా రూ.11,000 కోట్లు ప్రజలపై భారాలు వేయడం దుర్మార్గమని విమర్శించారు. విద్యుత్ చార్జీలు పెంపువలన వినియోగదారులపై ఒక యూనిట్‌కి రూ.1.80పైసల నుండి రూ.2.40 పైసలు అదనపు భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కోస్టల్ కారిడార్ పేరుతో సముద్ర తీర భూములన్ని కార్పొరేట్లకు కట్టపెట్టే కుట్ర చేస్తున్నాయని దీనికి వ్యతిరేకంగా ఉద్యమం తప్పదని హెచ్చరించారు. విధానపరంగా గత వైసిపి ప్రభుత్వానికి, నేడు కూటమి ప్రభుత్వానికి ఎటువంటి తేడా లేదని ఆరోపించారు. ఆంధ్రుల ఆత్మ బలిదానాలతో సాధించిన విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌ను ప్రభుత్వరంగంలోనే కొనసాగించాలని, ప్రైవేటీ కరణ జోలికి వస్తే పోరాటంతో తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్ మాట్లాడుతూ సముద్ర తీరంలో ఉన్న ఉప్పు భూములు సి.ఆర్.జెడ్ భూములు పోర్టుకు అప్పజెప్పడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుందని ఆరోపించారు. దీనివలన తరతరాలుగా జీవనం కొనసాగిస్తున్న ఉప్పు రైతులకు నష్టం జరుగుతుందన్నారు. జీడిపిక్కల 80 కేజీలు బస్తాకు రూ.16,500 చెల్లించి రాష్ట్ర ప్రభుత్వం ఆర్బీకేల ద్వారా కొనుగోలు చేయాలని జీడి కార్మికు లకు పిఎఫ్, ఈఎస్ఐ, అమలు చేయాలని, జిల్లాలో వంద పడకల ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో గిరిజన భూములను గిరిజనేతరులు ఆక్రమించుకుంటున్నారని, దీనికి వ్యతిరే కంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. జిల్లాలో ఐటీడీఏ లేక పోవడంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విశాఖ డెయిరీ పాలు రేటు తగ్గించడం వల్ల పాలరై తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు మాట్లాడుతూ 18వ జిల్లా మహాసభల్లో జిల్లాలో ప్రజలు ఎదుర్కోకొంటున్న అన్ని సమస్యల పైన చర్చించి భవిష్యత్తు కర్తవ్యాల్ని ఈ మహాసభల్లో రూపొందిస్తామన్నారు. వంశధార రెండో దశ పూర్తి చేసి చివర భూములకు నీరు ఇవ్వాలని, నిర్వాసితులకు 2013 భూ సేకరణ చట్టం అమలు చేయాలని, రిమ్సిని సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌గా ప్రమోట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ బహిరంగ సభలో సీపీఎం నాయకులు బి.కృష్ణమూర్తి, జి.సింహాచలం, కె.నాగమణి, నంబూరు షణ్ముఖరావు, పి.తేజేశ్వరరావు, సిర్ల ప్రసాద్, పోలాకి ప్రసాదరావు తదితరులు ప్రసంగించారు. సీపీఎం స్థానిక నాయకులు ఎం.గణపతి ఆహ్వానం పలికారు.

## ఫ్యూచర్‌స్టార్ ఆర్టిస్ట్ అవార్డుకు సత్యనారాయణ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

మణికర్ణిక ఆర్ట్ గ్యాలరీ ఉత్తరప్రదేశ్ 60వ నేషనల్ వైడ్ ఆన్‌లైన్ ఆర్ట్‌గ్యాలరీ కాంపిటీషన్ నవంబర్ 6 నుంచి 17 వరకు జరుగనుంది. ఈ కార్యక్రమంలో అన్ని రాష్ట్రాల నుంచి వచ్చిన ఎంట్రీస్‌లో దిబెస్ట్ 60 ఎంట్రీస్‌ని ఎంచగా, ఏపీలో ఇద్దరు సెలెక్ట్ అయ్యారు. శ్రీకాకుళం నుంచి ఎర్ర సత్యనారాయణ (ఆర్ట్, క్రాఫ్ట్, హెల్త్ ఉపాధ్యాయ జిల్లా అధ్యక్షులు) వరం హై స్కూల్ డ్రాయింగ్ టీచర్ వేసిన బయోడైవర్సిటీ చిత్రం ఎంపికైంది. 60వ ఫ్యూచర్ స్టార్ ఆర్టిస్ట్ అవార్డుకు సెలెక్ట్ అవడం పాఠశాల ప్రధానోపాధ్యాయులు పెంకి ఇందిరామణి, ఉపాధ్యాయ సిబ్బంది చిత్రకళ ఉపాధ్యాయుడు ఎర్ర సత్యనారాయణ మాస్టారుకు అభినందనలు తెలిపారు.




## యాచకునికి సపర్యలు చేసిన రెడ్‌క్రాస్ బృందం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

స్థానిక పుణ్యక్షేత్రం అరసవల్లి సూర్యనారాయణమూర్తి సన్నిధిలో నిస్సహాయ అనాథ వృద్ధునికి ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ శ్రీకాకుళం సపర్యలు చేసి మానవత్వం చాటుకుంది. ఆదివారం, అందులోను కార్తీక మాసం కావటంతో భక్తులతో కిటకిటలాడిన అరసవల్లి క్షేత్రంలో నిస్సహాయ వృద్ధుడు, కనీసం ఒంటిపై బట్టలు కూడా లేక, తిండి లేక తిరుగుతున్న యాచకుడు రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్‌మోహనరావుకు తారసపడగా, తక్షణమే రెడ్‌క్రాస్ ప్రతినిధి బృందంతో కలసి పూర్తి సపర్యలు చేసి, కొత్త వస్త్రాలతో పాటు, అన్నసమారాధన చేపట్టారు. అనంతరం మాట్లాడుతూ ఈయనకు మతి స్థిమితం సరిగా లేదని, గత ఆరేళ్లుగా ఈయనకి సేవ చేస్తున్నామని, ప్రతిరోజు ఆహారం అందిస్తున్నామన్నారు. ఇటువంటివారు ఎవరికైన కనిపిస్తే రెడ్‌క్రాస్‌ను సంప్రదించవచ్చని తెలిపారు. రెడ్‌క్రాస్, సివి నాగజ్యోతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతి రోజు నిత్యాన్నదానం శ్రీ వరసిద్ధి వినాయక దేవస్థానం ద్వారా, దేవస్థానం మేనేజర్ డి.లక్ష్మణరావు, ప్రసాద్, ఇతర సభ్యులతో, స్థానిక ఏడురోడ్ల కూడలి, డే అండ్ నైట్ కూడలి, అరసవల్లి పుణ్య క్షేత్రాల్లో నిత్యం అన్నధానమందిస్తున్నారన్నారు. అలాగే యాచకునికి సపర్యలు చేసిన రెడ్‌క్రాస్ ప్రతినిధులు నంది ఉమాశంకర్, జి.పవన్ కుమార్, వెంకట రమణలను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.



## ఆర్గాన్ డోనర్స్ అసోసియేషన్‌లో మణికంఠరావు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శరీర అవయవ దాతల సంఘం, రాష్ట్ర సహాయ కార్యదర్శిగా నియమించబడ్డ తొత్తడి మణికంఠరావుకు స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్, నగర టిడిపి అధ్యక్షులు మాదారపు వెంకటేష్‌తోపాటు పలువురు వక్తలు శనివారం అభినందించారు. ఆల్ ఇండియా బాడీ అండ్ ఆర్గాన్ డోనర్స్ అసోసియేషన్ సంఘంలో నగరానికి చెందిన మణికంఠరావుకు స్థానం లభించిందని సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషనల్ అండ్ ఛారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కె.బాబురావు తెలిపారు. న్యూ శ్రీకాకుళం బ్లడ్‌బ్యాంకు యాజమాన్యం, యునైటెడ్ ఎన్జీవో సభ్యులు మాట్లాడుతూ మణికంఠ చేస్తున్న సేవలను గుర్తించి ఈ మహోన్నత బాధ్యతను అప్పగించిన సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషనల్ అండ్ ఛారిటబుల్ ట్రస్ట్‌కు ధన్యవాదాలు తెలిపారు. మణికంఠ న్యూ శ్రీకాకుళం బ్లడ్ బ్యాంకు మేనేజర్‌గా బాధ్యతలను నిర్వర్తిస్తూ, నిత్యం ఏదో ఒక సేవలో నిమగ్నమవ్వటం మనం చూస్తున్నామన్నారు. నగరంలో అన్ని స్వచ్ఛంద సంస్థల సభ్యులను కలుపుకొని ఒక తాటిపైకి తేవటం, సేవలు కొనసాగించటం గొప్ప విషయమని, ఈ సేవలు కొనసాగాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. తనకు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శిగా నియమించటంలో భాగమైన ప్రతీ ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నగరంలో పలువురు మణికంఠకు అభినందించారు. ఈ కార్యక్రమంలో న్యూ శ్రీకాకుళం బ్లడ్ బ్యాంకు యాజమాన్యం, యునైటెడ్ ఎన్జీవో సభ్యులు, పలువురు వక్తలు పాల్గొన్నారు.



## మంత్రి అచ్చెన్నను కలిసిన టూటౌన్ సీఐ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో నూతన సీఐగా బాధ్యతలు స్వీకరించి పి.ఈశ్వరరావు శనివారం నిమ్మాడలో వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెనాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేశారు. వీరితో పాటు రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



## పిల్లల హక్కుల సాధనతోనే మానసికానందం

(సత్యంన్యూస్, నరసన్నపేట)

పిల్లల హక్కుల సాధనతోనే వారిలో మానసికానందం చూడగలమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం అన్నారు. జిల్లా పర్యటనలో ఉన్న ఆయన శుక్రవారం సాయంత్రం నరసన్నపేట మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బాలల హక్కుల పరిరక్షణలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల పాత్రపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులకు ఆటల పీరియడ్లు కనుమరుగౌతున్నాయని, దీనిని దృష్టిలో ఉంచుకుని రాష్ట్రవ్యాప్తంగా అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో ఆట లకు ఒక పీరియడ్ కేటాయించేలా తమ కమిషన్ చైర్‌పర్సన్ కేసలి అప్పారావు సారధ్యంలో అన్ని జిల్లాల కలెక్టర్లు, విద్యాశాఖాధికారులకు ఆదేశాలిచ్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. ప్రతీనెలా రెండో శనివారం, పదో తరగతి విద్యార్థులకు ప్రతీ ఆదివారం సెలవులను అమలుచేసేందుకు సంబంధిత మండల విద్యాధికారులు దేగకళ్లతో చూడాలన్నారు. క్రమశిక్షణ చర్యల పేరుతో విద్యార్థులను ఎటువంటి ఇబ్బందులకు గురి చేసినా బాలల హక్కుల ఉల్లంఘనగానే తమ కమిషన్ ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని అన్నారు.




నరసన్నపేట మండల విద్యాశాఖాధికారులు యు.శాంతారావు, బి.దాలినాయుడు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశాలు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ నిర్దేశిత సూత్రాలను అనుసరించి బాలల హక్కుల పరిరక్షణ, సంక్షేమ కార్యక్రమాలపై నిర్విరామ కృషి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ అధికారి వెంకటరమణ, ఎంపీడీవో బి.మధుసూదనరావు, నోడల్ అధికారి ఎస్.శ్రీనివాసరావు, స్త్రీ, శిశు సంక్షేమ శాఖాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## చట్టలపై అవగాహన అవసరం

(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

విద్యార్థినీ, విద్యార్థులకు చట్టలపై అవగాహన అవసరమని జిల్లా న్యాయశాఖ సేవాధికార సంస్థ, కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. సీనియర్ సివిల్ జడ్జి కార్యదర్శి జిల్లా న్యాయశాఖ అధికారి సంస్థ ఆర్.సన్యాసినాయుడు శుక్రవారం సాయంత్రం చిలకపాలెం శివానీ ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ న్యాయసేవ దినోత్సవం సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులకు చట్టలపై అవగాహన కల్పించారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ చేస్తున్న సేవలను, కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో సోంపేట, పలాస జూనియర్ సివిల్ జడ్జి ఎ.రాము, యు.మాధురి, పలాస, జి.ఇందిరప్రసాద్, ప్యానెల్ అడ్వకేట్, శివాని కళాశాల ప్రిన్సిపల్ వై.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.




























# రోణంకికి కళింగ కార్పొరేషన్..
# కొరికానకు సుడా

- కావలి గ్రీష్మ, పాలవలస యశస్వెలతో ఉమ్మడి జిల్లాకు 4 పోస్టులు
- రెండో జాబితాలోనూ జిల్లాకు అగ్రతాంబూలమిచ్చిన కూటమి
- మొదటిసారి కంటే ఈ కూర్పు అదుర్స్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సుడా) చైర్మన్‌గా పాతపట్నానికి చెందిన కొరికాన రవికుమార్‌ను నియమించినట్లు ప్రభుత్వం ప్రకటించింది. అలాగే రాష్ట్ర కళింగ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా రోణంకి రామకృష్ణంనాయుడును నియమించింది. ఇక రాష్ట్ర మహిళా కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా కావలి గ్రీష్మ, తూర్పుకాపు సంక్షేమం, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా పాలవలస యశస్వినిని నియమించినట్లు శనివారం ప్రకటన విడుదల చేసింది. ఉమ్మడి జిల్లాను ప్రాతిపదికన తీసుకుంటే నాలుగు ప్రాధాన్యత గల పోస్టులు జిల్లాకు లభించినట్లయింది. మొదటిసారి ప్రకటించిన కార్పొరేషన్ల చైర్మన్ల కంటే రెండో విడతలో వచ్చిన పదవులు జిల్లాకు కిక్ ఇచ్చాయి. చంద్రబాబునాయుడు ఈసారి పూర్తిగా పాత తరాన్ని పక్కన పెట్టి, కొత్త రక్తాన్ని ఎక్కిస్తున్నారని పరోక్షంగా ప్రకటించినట్లయింది. ఇందులో సుడా చైర్మన్‌గా నియమితులైన కొరికాన రవికుమార్ గత కొన్నాళ్లుగా పాతపట్నం నియోజకవర్గ బాధ్యతలు చూస్తున్నారు. ఈయన భార్య భవాని గడిచిన ఎన్నికల్లో జనసేన కోసం పాతపట్నంలో కీలకంగా పని చేయగా, పాలకొండ నియోజకవర్గంలో జనసేన తరఫున పోటీ చేసిన నిమ్మక జయకృష్ణ గెలుపు కోసం కొరికాన రవికుమార్ ఆర్థికంగా, సామాజికంగా అండగా నిలిచారు. రాష్ట్రంలో అనేకచోట హేచరీస్ వ్యాపారం నిర్వహిస్తున్న కొరికాన రవికుమార్‌కు పవన్‌కల్యాణ్ ఇచ్చిన మాట ప్రకారం సుడా చైర్మన్‌గా నియమించారు. ఇక కళింగ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన రోణంకి కృష్ణంనాయుడు నరసన్నపేట నియోజకవర్గం పోలాకి మండలానికి చెందిన కరుడుగట్టిన రాజకీయవేత్త. 1995 సమయంలో ఈయన అక్కడ జెడ్పీటీసీగా పని చేశారు. న్యాయవాద వృత్తిలో ఉంటూ కాంగ్రెస్ పార్టీకి సేవలందించారు. ఎప్పుడైతే కాంగ్రెస్‌లో నేతలంతా వైకాపాకు వెళ్లిపోయారో, అప్పుడు ఈయన తెలుగుదేశం గూటికి


కొరికాన రవికుమార్




కావలి గ్రీష్మ


పాలవలస యశస్వి


రోణంకి కృష్ణంనాయుడు

చేరారు. రోణంకి కృష్ణంనాయుడుకు జిల్లావ్యాప్తంగా పెద్ద ఎత్తున పరిచయాలు ఉన్నాయి. ఇక మాజీ స్పీకర్ ప్రతిభాభారతి కుమార్తె కావలి గ్రీష్మకు రాష్ట్ర మహిళా కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించారు. కావలి గ్రీష్మ 2019, 2024ల్లో తెలుగుదేశం టిక్కెట్ కోసం ప్రయత్నించారు. అయితే రాజాం మాత్రమే అప్పటికి ఉమ్మడి జిల్లాలో ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గం కావడంతో పార్వతీపురం టిక్కెటైనా ఇవ్వాలని కోరారు. సమీకరణాలు కుదరకపోవడంతో ఆమెను పక్కన పెట్టారు. ఎన్నికల ముందు జరిగిన తెలుగుదేశం మహానాడులో బహిరంగ వేదిక మీద తొడకొట్టి సవాల్ విసరడంతో ఒక్కసారిగా కావలి గ్రీష్మ లైమ్‌లైట్‌లోకి వచ్చారు. కావలి ప్రతిభాభారతి కూతురుగానే కాకుండా తెలుగుదేశం రక్తమే తనలో కూడా ఉందని చూపించిన ఆమెకు రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవి ఇచ్చారు. ఇక మిగిలింది తూర్పుకాపు సంక్షేమం, అభివృద్ధి కార్పొరేషన్. దీనిని పాలవలస యశస్వినికి కేటాయించారు. పవన్‌కల్యాణ్ జనసేన పార్టీ పెట్టిన దగ్గర్నుంచి ఆమె పాతపట్నం కేంద్రంగా ఉంటూ రాష్ట్రస్థాయి జనసేన భావజాల వ్యాప్తిలో పని చేస్తున్నారు. జిల్లాలో జనసేనకు ఉన్న మేథోపరమైన కేడర్‌లో ఈమె మొదటి వరుసలో ఉన్నారు. యశస్విని పాలవలస రాజశేఖరం తమ్ముడి కూతురు. ఈమె తండ్రి చిన్నరాజు కూడా 2006లో వీరఘట్టం ఎంపీపీగా పని చేశారు. యశస్విని 2024లో జనసేన తరఫున విజయనగరం సీటు ఆశించారు. అయితే ఆ పక్క నియోజకవర్గంలోనే లోకం మాధవికి టిక్కెట్ ఇస్తానని ఎన్నికల వేడి రాజుకోక ముందే పవన్‌కల్యాణ్ ప్రకటించడంతో యశస్వినికి అక్కడ సీటు ఇవ్వలేకపోయారు. దీంతో ఆమెకు తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ పదవి లభించింది. యశస్విని కుటుంబంలో తాత, నాన్నమ్మ దగ్గర్నుంచి పెదనాన్న, చిన్నాన్న, మేనమామ కొడుకు వరకు అందరూ రాజకీయాల్లో అనేక పదవులు నిర్వహించారు. కూటమి ప్రభుత్వం రెండో విడత ప్రకటించిన జాబితాలో అన్నింటికంటే ప్రధానమైన అంశమేమిటంటే.. స్టూడెంట్స్ ఎథిక్స్ అండ్ వాల్యూస్ అంశంలో ప్రభుత్వానికి సలహాదారుగా ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావును నియమించారు. ఇది పూర్తిగా కేబినెట్ ర్యాంకు పదవి.

# సుస్థిర సేద్యానికి యంత్రమే మంత్రం




- వ్యవసాయ శాఖకు పూర్వ వైభవం తీసుకొస్తాం
- మంత్రి అచ్చెన్నాయుడు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

వ్యవసాయం లాభసాటిగా మారాలంటే రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పిలుపునిచ్చారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఆరు గాలం కష్టపడ్డ రైతులు తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందేలా ప్రణాళిక రూపొందిస్తున్నామని చెప్పారు. ఉత్తర కోస్తాకు అనువైన లాభసాటి వ్యవసాయ విధానాలు అనే అంశంపై ఆచార్య యన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిశోధనా స్థానం, రాగోలు, జిల్లా వ్యవసాయ శాఖ సంయుక్తంగా నిర్వహిస్తున్న "కిసాన్ మేళా"ను రాగోలు వ్యవసాయ పరిశోధనా కేంద్రంలో శనివారం ఆయన ప్రారంభించారు. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు అధ్యక్షతన జరిగిన ఈ కిసాన్ మేళాలో ముఖ్య అతిథిగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వ్యవసాయ శాఖ పై ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. మార్టేరు ను తలదన్నేలా రాగోలు పరిశోధన స్థానాన్ని అభివృద్ధి చేస్తామని, శ్రీకాకుళం సన్నాల బియ్యంకు ప్రపంచ ఖ్యాతి వచ్చేలా కృషి చేస్తామన్నారు "పొలం పిలుస్తుంది" కార్యక్రమం ద్వారా ప్రతి వారంలో రెండు రోజులు వ్యవసాయ, దాని అనుబంధ శాఖల అధికారులు,రైతులు దగ్గరికి వెళ్లి పొలాలు చూసి రైతులతో మాట్లాడి వారికి ఏ ఏ అవసరాలు ఉన్నాయో, కష్టాలు ఏంటి? బాధలు ఏంటని? తెలుసుకొని తద్వారా పరిష్కరించడానికి కృషి చేయాలన్నారు. తన శాఖకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని ముఖ్యమంత్రిని కోరుతానన్నారు. జిల్లాలో సకాలంలో నీరు అందక ప్రతి సంవత్సరం కరువు, కాటకాలతో వ్యవసాయం చేయలేక వలసలు వెళ్లే వారి సంఖ్య పెరుగుతుందని, దానిని నిరోధించాలని చెప్పారు. అత్యంత ప్రాధాన్యత రంగమైన వ్యవసాయాన్ని గత ఐదేళ్లు పూర్తిగా నిర్లక్ష్యానికి గురిచేయడం, కేటాయించిన బడ్జెట్ ఖర్చు చేయకపోవడంతో రైతు పరిస్థితి ఘోరంగా మారిందన్నారు. సబ్సిడీపై యంత్రాలను, డ్రోన్లను అందిస్తామని, సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని, ప్రతి సంవత్సరం భూమికి భూసార పరీక్షలు నిర్వహిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా అన్ని గ్రామాలకు డ్రోన్ల సాంకేతికతను అందుబాటులో ఉంచామని, రైతులు గ్రూపులుగా ఏర్పడి వాటి సేవలు తక్కువ ధరకు పొందవచ్చని చెప్పారు. పాఠశాలస్థాయి విద్యార్థులు కూడా తరచూ ఇలాంటి మేళా లకు హాజరై కొత్త విషయాలు నేర్చుకునేలా ప్రోత్సహించాలన్నారు. నరసన్నపేట, శ్రీకాకుళం ఎమ్మెల్యేలు బగ్గు రమణ మూర్తి, గొండు శంకర్‌లు మాట్లాడుతూ లాభదా యక వ్యవసాయ విధానాలపై రైతులకు సంపూర్ణ అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని అన్నారు. జిల్లా అదృష్టం కొద్దీ వ్యవసాయ శాఖకు మంత్రిగా అచ్చెన్నాయుడు ఉన్నారని, రైతుల ప్రయోజనాల కోసం ఆయన ఎంత దూరమైనా వెళ్లగలరని చెప్పారు. నైపుణ్యాభివృద్ధికి సాంకేతికతను జోడించి యువతను ఈ రంగం వైపు ఆకర్షితులు అయ్యేలా ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో తొలుత వివిధ శాఖలు ఏర్పాటుచేసిన వ్యవసాయ ఉత్పత్తి ప్రదర్శనలను ఆసక్తికరంగా తిలకించారు. కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ యాజమాన్య పద్ధతులపై ప్రచురించిన పలు పుస్తకాలను మంత్రి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉప కులపతి డాక్టర్. ఆర్.శారద జయలక్ష్మి దేవి, పరిశోధన సంచాలకులు డాక్టర్ పి.వి.సత్యనారాయణ, విస్తరణ సంచా లకులు డాక్టర్ జి. శివనారాయణ, వ్యవసాయ విశ్వ విద్యాలయం డీన్ డా. సి.హెచ్. శ్రీనివాసరావు, డైరెక్టర్ సీడ్స్ డా. వై.సతీష్, శ్రీకాకుళం జిల్లా వ్యవసాయ అధికారి కె.త్రినాధస్వామి, డాక్టర్ దానేటి శ్రీధర్, ఉత్తరకోస్తా మండల వ్యవసాయ శాఖాధిపతులు, పెద్ద సంఖ్యలో జిల్లా నుండి రైతులు, ఎఫ్పిఓ, ఎన్జీవో, వ్యవసాయ కళాశాల, వ్యవసాయ ఇంజినీరింగ్ డిప్లమో విద్యార్థులు ఈ మేళాలో పాల్గొన్నారు.

# భార్యను వదిలేశాడని భర్త ఇంటిపై దాడి

- ✔ తలుపులు బద్దలు గొట్టి.. ఇంట్లోకి చొరబడి..
- ✔ పోలీసులు స్పందిచలేదని బాధితుల ఆరోపణ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

భార్యను విడిచిపెట్టేశాడన్న అక్కసుతో కుటుంబ సభ్యులు, కుల పెద్దలతో కలిసి భర్త ఇంటిపై దాడిచేసిన ఘటన శుక్రవారం సాయంత్రం పలాస–కాశీబుగ్గలో చోటుచేసుకుంది. పట్టణంలోని తంగుడు హరికృష్ణపై ఆయన భార్య పొందూరుకు చెందిన పొట్నూరు లక్ష్మణ రావు కుమార్తె కవిత శుక్రవారం ఎమ్మెల్యే గౌతు శిరీషను కలిసిన అనంతరం కాశీబుగ్గ సర్కిల్ కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహిస్తున్న ఎస్పీ మహేశ్వర్‌రెడ్డిని కుటుంబ సభ్యులు, కళింగ కోమటి పెద్దలతో కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం నేరుగా భర్త హరికృష్ణ ఇంటి వద్దకు వెళ్లారు. దీన్ని గమనించిన హరికృష్ణ, ఆయన కుటుంబ సభ్యులు తలుపులు వేసుకొని ఇంటిలోనే ఉండిపోయారు. దీంతో కవితతో వచ్చిన ఆమె కుటుంబ సభ్యులు, కులపెద్దలు కలిసి గ్రిల్స్‌ను బలవంతంగా తొలగించి, తలుపులను తెరిచారని హరికృష్ణ తెలిపారు. దీన్ని అడ్డుకొనే ప్రయత్నం చేసిన హరికృష్ణ కుటుంబ సభ్యులపై దాడికి ప్రయత్నించారని ఆరోపించారు. తలుపులు తెరిచిన తర్వాత కవితను, ఆమె బిడ్డను ఇంట్లో పెట్టి వారికి కాపలాగా కొంత మంది కళింగకోమటి పెద్దలు ఇంటి బయట ఉన్నారు. గ్రిల్స్‌ను తొలగిస్తున్న సమయంలో 112కు మూడుసార్లు ఫోన్ చేసిన తర్వాత పట్టణ పోలీస్ స్టేషన్ నుంచి సిబ్బంది వచ్చి అక్కడ జరుగుతున్న తంతును చూసి వెళ్లిపోయారని హరికృష్ణ పేర్కొన్నారు. ఆ తర్వాత స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఎవరూ స్పందించలేదన్నారు.

పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్న అంశాల మేరకు 2013లో హరికృష్ణ, కవితకు వివాహం జరిగిన తర్వాత వీరికి 2015లో ఒక కుమారుడు పుట్టాడు. కుమారుడు పుట్టిన కొన్ని నెలల తర్వాత కుటుంబ కలహాలు ప్రారంభమయ్యాయి. 2022లో కవిత పుట్టింటికి వెళ్లిపోయారు. ఆ తర్వాత 2023లో ఎచ్చెర్ల పోలీస్ స్టేషన్‌లో కవిత భర్త హరికృష్ణపై ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు సందర్భంగా హరికృష్ణ తన కుటుంబ సభ్యులు, కొందరు పెద్దలతో కలిసి ఎచ్చెర్ల వెళ్లారని తెలిపారు. సమస్యకు పరిష్కారం కోసం వెళ్లిన హరికృష్ణను పోలీసులతో చితక్కొట్టించినట్టు పేర్కొన్నాడు. ఆ సందర్భంగా జరిగిన పరిణామాల నేపథ్యంలో హరికృష్ణ సోంపేట న్యాయస్థానాన్ని విడాకుల కోసం ఆశ్రయించాడు. ఇద్దరి మధ్య వివాదం నడుస్తున్న సందర్భంలో సెప్టెంబర్ 3న తన ఇంటి వద్దకు వచ్చి తనపై కవిత బంధువులు దాడికి దిగినట్లు స్థానిక పోలీసులకు హరికృష్ణ ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై కేసు నమోదు చేయకపోవడంతో స్థానిక కోర్టులో ప్రైవేట్ కేసు దాఖలు చేశారు. ఆ వ్యవహారం ఇంకా ఎటూ తేలకముందే మరోసారి హరికృష్ణ ఇంటి మీద దాడి జరిగింది. అత్తారింటికి వచ్చిన కవితకు ఎవరూ హాని తలెట్టకుండా నలుగురు కానిస్టేబుల్స్‌ను హరికృష్ణ ఇంటి వద్ద ఏర్పాటుచేశారు. దాడి చేసినవారిలో కొందరు టెక్కలి టీడీపీ నాయకులుగా చెలామణి అవుతున్నవారేనని చర్చసాగుతుంది. అంతకు ముందు స్థానిక ఎమ్మెల్యే ఇదే అంశంపై కళింగకోమటి పెద్దలతో కలిసి మీడియాతో మాట్లాడం, ఆ తర్వాత



బాధితుల ఇంటిపై దాడి జరగడంతో పలాసలో హాట్ టాపిక్‌గా మారింది.

హరికృష్ణ భార్య కవితను విడిచిపెట్టేశాడు కాబట్టి ఆమెకు న్యాయం చేయాలనే ఆలోచనతోనే అందరూ బాధిత మహిళకు సపోర్టుగా నిలబడ్డారనే వాదన కూడా ఉంది. వాస్తవంగా వీరి మధ్య వివాదం కోర్టుల్లో నడుస్తుందనే విషయం ఎస్పీ మహేశ్వరరెడ్డికి, ఎమ్మెల్యే గౌతు శిరీషకు వివరించకుండా కవిత బంధువులుగా చెప్పుకుంటున్న టీడీపీ నాయకులు దాచిపెట్టారని విశ్వసనీయ సమాచారం. మరోవైపు హరికృష్ణతో పాటు ఆయన కుటుంబ సభ్యులపై దాడి, ఇల్లు ధ్వంసం ఘటనపై కేసు నమోదు చేయకుండా స్థానిక పోలీసులు తాత్సారం చేయడంతో ఫిర్యాదును పోస్టు ద్వారా ఎస్పీకి, డీఎస్పీకీ, సీఐకి పంపించారు. దీనిపై స్పందించిన పోలీసు ఉన్నతాధికారులు హరికృష్ణపై దాడి, ధ్వంసంపై తక్షణమే కేసు నమోదు చేయాలని ఆదేశించడంతో శనివారం ఎఫ్ఐఆర్ 509/2024తో కేసు నమోదు చేశారు. ఈ దాడి ఉద్దేశపూర్వకంగా జరిగిందని బాధితులు ఆరోపిస్తున్నారు. న్యాయస్థానంలో విడాకులు కేసు నడుస్తుందని, సెప్టెంబర్‌లో దాడి జరిగిన ఘటనపై స్థానిక కోర్టులో ప్రైవేట్ కేసు నమోదు చేశామని తెలిసినా కవిత కుటుంబ సభ్యులు కుల పెద్దలను తీసుకువచ్చి దాడికి పాల్పడ్డారని, పోలీసులు సకాలంలో స్పందించి ఉంటే దాడి జరిగేది కాదని చెబుతున్నారు. హరికృష్ణ తన కుటుంబంపై పోలీసులు వ్యవహరించిన తీరుపై హైకోర్టును ఆశ్రయిస్తున్నట్టు తెలిసింది.






## మాస్టర్‌ప్లాన్‌పై అభిప్రాయం చెప్పండి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం నగరానికి కొత్తగా అమలు చేయనున్న మాస్టర్‌ప్లాన్ ముసాయిదాపై ప్రజలు తమ అభిప్రాయాలు చెప్పాలని కమిషనర్ ప్రసాదరావు ఒక ప్రకటనలో కోరారు. స్థానిక బాపూజీ కళామందిర్‌లో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మాస్టర్ ప్లాన్ డ్రాఫ్ట్ అందుబాటులో ఉంచుతున్నామని, ఇందులో అభ్యంతరాలుంటే చెప్పాల్సిందిగా ఆయన కోరారు. ఈ కార్యక్రమానికి స్వయంగా నియోజకవర్గ ఎమ్మెల్యేలే వస్తున్నందున అభ్యంతరాలు చెప్పుకోవచ్చని కమిషనర్ ఆ ప్రకటనలో కోరారు. కొత్త మాస్టర్‌ప్లాన్ వల్ల ఏ ప్రాంతాలు ఎఫెక్ట్ అవుతున్నాయి, ఏ మార్గాలు వెడల్పవుతున్నాయి, దీనివల్ల లాభాలేంటి, నష్టాలేంటి చర్చించడానికి ప్రజలంతా హాజరుకావాలని అసిస్టెంట్ సిటీ ప్లాన్ సత్యనారాయణ కోరారు.

## కేంద్రమంత్రి పీఎస్‌గా లాఠకర్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుకు ప్రైవేట్ సెక్రటరీగా శ్రీకేష్ బి. లాఠకర్‌ను నియమిస్తూ చీఫ్ సెక్రటరీ శనివారం ఉత్తర్వులు జారీచేశారు. లాఠకర్ 2011 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి. శ్రీకాకుళం కలెక్టర్‌గా మూడేళ్ల పాటు వైకాపా హయాంలో ఆయన పని చేశారు. జిల్లాపై అవగాహన ఉందన్న కారణంతో రామ్మోహన్‌నాయుడు లాఠకర్‌ను రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం సర్వీసులకు అటాచ్ చేయాలని కోరడంతో ఆయన విజ్ఞప్తి మేరకు భారత ప్రభుత్వ డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ & ట్రైనింగ్ ఆయన్ను విమానయాన శాఖ పీఎస్‌గా నియమించారు.

## రాష్ట్రంలో నియంత పాలనకు స్వస్తి పలకాలి



(సత్యంన్యూస్,శ్రీకాకుళం)

రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు నియంత పాలనకు స్వస్తి పలకాలని వైకాపా జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. వైకాపా సోషల్ మీడియాపై ప్రభుత్వం కక్షకట్టి కేసులు పెడుతోందని ఆరోపిస్తూ జిల్లా ఎడిషన్ ఎస్పీ శ్రీనివాసరావును జిల్లా పోలీసు కార్యాలయంలో కలిసి శనివారం వినతిపత్రం అందించారు. అనంతరం విలేకరులతో దాసన్న మాట్లాడుతూ రాష్ట్రంలో చంద్రబాబు తుగ్లక్ పాలన సాగుతుందని విమర్శించారు. వైకాపా సోషల్ మీడియా యాక్టివిస్టులపై తప్పుడు కేసులు బనాయించి ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం చేస్తున్న అక్రమాలపై ప్రశ్నించారనే అక్కసుతో సోషల్ మీడియా ప్రతినిధులపై తప్పుడు కేసులు పెడుతున్నారన్నారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలను పట్టించుకోకుండా పోలీసులు వ్యవహరిస్తున్నారని నిలదీశారు. ఎవరి మెప్పు కోసం ఈ కేసులు బనాయిస్తున్నారని పోలీసులను ప్రశ్నించారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని గుర్తించుకోవాలని ప్రభుత్వ తీరును ఎండగట్టారు. ఏఎస్పీని కలిసిన వారిలో ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్ల కిరణ్ కుమార్, శ్రీకాకుళం మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ మెంటాడ పద్మావతి, వైకాపా నాయకులు పొన్నాడ రుషి, యడ్ల వెంకట్, అంబటి శ్రీను, ముంజేటి కృష, రౌతు శంకరరావు, కామేశ్వరి, గేదేల పురుషోత్తం పాల్గొన్నారు.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.